సాక్షి తిరుపతి

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



నేటి నుంచి తిరుత్సవ-2025
తిరుపతి ఐఐటీలో తిరుత్సవ-2025 వేడుకల నిర్వహణకు విద్యార్థులు భారీ ఏర్పాట్లు చేశారు. - 8లో



ముత్యపు పందిరిపై శ్రీహరి
కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీహరి సింహవాహనంపై, ముత్యపుపందిరిపై దర్శనమిచ్చారు. - 8లో



ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు
ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న సమ్మె



నిరసన తెలుపుతున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో గౌరవవేతనం పెంచాలంటూ జూడాలు చేస్తున్న సమ్మె గురువారానికి 18వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా వర్సిటీ ఆవరణలో యూజీ, పీజీ పశు వైద్య విద్యార్థులు పెద్దఎత్తున తమకు న్యాయం చేయాలని నినదిస్తూ బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం, మంత్రులకు, వర్సిటీ అధికారులకు పలుమార్లు తమ గోడును విన్నవించుకున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. వెటర్నరీ జూడాలను చిన్నచూపు చూస్తూ పక్షపాతంగా వ్యవహరిచండంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌరవవేతనం పెంచకపోతే భవిష్యత్‌లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టీటీడీ బోర్డు సభ్యున్ని తొలగించాలి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాలక మండలి సభ్యుడు నరేష్ కుమార్‌ను తక్షణమే ప్రభుత్వం తొలగించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఇన్‌చార్జ్ భూమన అభినయరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ ఉద్యోగుల మనోభావాలను కించపరిచిన బోర్డు సభ్యుడు వెంటనే క్షమాపణలు చెప్పాలని తెలిపారు. టీటీడీలో వర్గ పోరు నడుస్తోందని, టీటీడీ చైర్మన్ ఒక వర్గం, అడిషనల్ ఈఓ మరో వర్గంగా సాగుతున్నారని ఆరోపించారు. శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద ఇటీవల అదనపు ఈఓ కొత్త విధానం తీసుకురావడంతో ఈ వివాదం మొదలైందని తెలిపారు. టీటీడీలో ప్రక్షాళన చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, ఇదేనా ప్రక్షాళన అని ఆయన ప్రశ్నించారు.

సంప్రోక్షణ చేయండి



జెండాలను చూపుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామి, అమ్మవార్ల గర్భాలయ శిఖర కలశాలకు రంగులు వేసి జెండాలు కట్టడంతో అవి అపవిత్రంగా మారాయని తక్షణం అధికారులు, అర్చకులు స్పందించి సంప్రోక్షణ చేయాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆలయం వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన గర్భాలయ శిఖరాలపై ఏదైనా చేయాలంటే ఆగమ నిబంధనల ప్రకారం చేయాలన్నారు. గతంలోనూ 2020లో జెండాలు కట్టడంతో అపశృతి ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రస్తుతం మళ్లీ అలాంటి పరిస్థితి రావడం మంచిది కాదన్నారు. ఆలయ సిబ్బంది శిఖరాల కలశాల వద్ద జెండాలు తొలగించినందుకు అభినందలని, ఆలయంలో సంప్రోక్షణ చేయాలని కోరారు.

కౌన్సిలా..! కౌరవ సభా..!

"అధికారం ఉందనే అహంకారం.. ప్రథమ పౌరురాలు, మేయర్‌ను ఏకవచనంతో సంబోధిస్తారు.. ఆ అధికారిపై చర్యలు తీసుకోండి అంటే కనీస స్పందన ఉండదు.. కౌన్సిల్ సమావేశానికి ఇతరులు రాకూడదనే నిబంధన ఉన్నా అధికార పార్టీ నాయకులు హల్‌చల్ చేస్తున్నా చర్యలు ఉండవు.. ఆపై చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డిప్యూటీ మేయర్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తారు.. మేయర్ సభను బాయ్‌కాట్ చేస్తే డిప్యూటీ మేయర్‌తో సభ నిర్వహిస్తారు.." ఇవీ గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్‌లో జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం కౌరవ సభను తలపించింది.



ఎస్వీయూ సెనేట్ హాల్ నుంచి బయటకు వస్తున్న మేయర్, కార్పొరేటర్లు

- ఏకవచనంతో సంబోధించిన అధికారిపై చర్యలకు మేయర్ పట్టు
- ఆత్మగౌరవం దెబ్బతీసేలా డీసీపీ మహాపాత్ర ప్రవర్తన
- తూతూమంత్రపు సారీలతో సరిపెట్టే యత్నం
- మనస్తాపానికి గురైన మేయర్ శిరీష
- బాయ్‌కాట్ చేసిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- ఎన్నడూ లేనివిధంగా డిప్యూటీ మేయర్‌తో ప్రమాణస్వీకారం

తిరుపతి తుడా: "డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంలో చోటు చేసుకున్న పరిణామాలలో ఓ భవనాన్ని కూల్చే క్రమంలో అక్కడ ఉన్న తన పట్ల డిప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్ర వ్యవహరించిన తీరు మనస్తాపానికి గురిచేసింది.. మేయర్ స్థానంలో ఉన్న నన్ను ఏకవచనంతో సంబోధించారు. మేయర్ అయితే నాకేంటి అంటూ మాట్లాడిన తీరు, అతని వ్యవహారశైలి నా ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసింది. నగర ప్రథమ పౌరురాలు అన్న కనీసం జ్ఞానం లేకుండా నా పట్ల దురుసుగా ప్రవర్తించారు. డీసీపీతో పాటు అతని కింద పనిచేసే సిబ్బంది మధు, వంశీలు నా పట్ల అంతే నిర్లక్ష్యంగా ప్రవర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇంత జరిగినా కమిషనర్ ఇప్పటి వరకు సంబంధిత వ్యక్తుల నుంచి వివరణ కోరకపోవడం అన్యాయం" అంటూ తిరుపతి నగర ప్రథమ పౌరురాలు మేయర్ డాక్టర్ శిరీష కౌన్సిల్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో మేయర్ శిరీష అధ్యక్షతన మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో హాజరయ్యారు. కమిషనర్ మౌర్య సభ నిర్వహించారు. ఈ క్రమంలో తనకు వివరణ ఇవ్వాలని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ శిరీష డిమాండ్ చేశారు. ఈ క్రమంలో డీసీపీ మహాపాత్ర అదేతరహాలో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు గళం విప్పారు. అలా ఏదైనా పొరపాటు జరిగి ఉంటే సారీ అంటూ దాటవేత ధోరణితో ఆయన సమాధానం ఇచ్చారు. కమిషనర్ మౌర్య కలుగచేసుకుని మేయర్‌కు ఇబ్బంది కలిగి ఉంటే సిబ్బంది తరపున క్షమాపణలు అన్నారు. అయితే మేయర్ స్పందిస్తూ తనను ఏకవచనంతో ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడారని చెబుతుంటే మీరేమో అలా జరిగి ఉంటే క్షమాపణలు అనడం సరైందని కాదని హితువు పలికారు. ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోలేనని తేల్చి చెప్పడంతో మేయర్ కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించారు. మేయర్ వెంట వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేస్తూ కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు.

మేడం.. మీకు ఇది తగునా..!

సాధారణంగా కౌన్సిల్ సమావేశానికి మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఉన్నతాధికారులు, శాఖాధిపతులకు మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోకి అధికార పార్టీ నాయకులు నాయకులు ప్రవేశించారు. అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషించారు. దీనిపై కార్పొరేటర్లు, అధికారులు అసహనం వ్యక్తం చేశారు. వార్షిక బడ్జెట్ ప్రాధాన్యతను గుర్తించి మేయర్ శిరీష కౌన్సిల్‌ను సాఫీగా నిర్వహించి ఆమోదింపజేశారు. మేయర్ వాకౌట్ తర్వాత సాధారణ కౌన్సిల్‌ను వాయిదా వేసే అవకాశం ఉన్నా.. అత్యుత్సాహం చూపి డిప్యూటీ మేయర్ ద్వారా సభ నిర్వహించడం పట్ల సర్వత్రా విమర్శలు మూటగట్టుకున్నారు.



కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆర్సీ మునికృష్ణ

డిప్యూటీ మేయర్‌తో ప్రమాణ స్వీకారమా !

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం.. వికృత చేష్టలు, అధికార దుర్వినియోగానికి వేదికైంది. ఓ పార్టీ తరపున ఎన్నికైన కార్పొరేటర్లను బెదిరించి, దాడులు చేసి అపహరించి, కిడ్నాప్‌లకు పాల్పడి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ గురువారం జరిగిన కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేశారు. చట్టప్రకారం కార్పొరేటర్లుగా ప్రమాణ స్వీకారం చేయడం పరిపాటి. మేయర్ గానీ, డిప్యూటీ మేయర్‌లు గానీ ప్రత్యేకంగా ప్రమాణస్వీకారం చేసిన దాఖలాలు ఇప్పటివరకు చరిత్రలో లేదు. కౌన్సిల్‌లో మెజారిటీ సభ్యులు మేయర్‌ను, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన వీరు రిజిస్టార్‌లో సంతకాలు చేస్తారే తప్ప ప్రత్యేకంగా వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించే సంప్రదాయం లేదు. ఈ విషయాన్ని విస్మరించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా డిప్యూటీ మేయర్ చేత ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయించడం విమర్శలకు తావిచ్చింది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేసిన అనంతరం కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులతో చర్చించి మూడవ వంతు కార్పొరేటర్ల బలం ఉంటే డిప్యూటీ మేయర్ ద్వారా కౌన్సిల్‌ను కొనసాగించవచ్చని కమిషనర్ నిర్ణయానికి వచ్చారు. మొదటి డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ద్వారా కౌన్సిల్‌ను కొనసాగించారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో మొత్తం 41 అజెండాలను ప్రవేశపెట్టగా 40 అంశాలకు ఆమోద ముద్ర పడింది. ఇందులో 41వ అంశం హెల్త్ అసిస్టెంట్ నియామకాన్ని వ్యూహాత్మకంగా అడ్డుకుని వాయిదా వేయించారు. స్టాండింగ్ కౌన్సిల్ లేకపోవడంతో హెల్త్ అసిస్టెంట్ పదోన్నతి నియామకాన్ని ఉద్యోగులు కోల్పోయారు.

వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

నగర మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2025-26 వార్షిక అంచనా బడ్జెట్, 2024-25 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలకు ఆమోదం తెలిపారు. కార్పొరేషన్ సెక్రటరీ రాధిక బడ్జెట్ అంశాన్ని ప్రవేశ పెట్టగా ఇందుకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా 2025-26 ఏడాదికి సంబంధించి పలు అభివృద్ధి పనులు, జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులకు గాను రూ.272 కోట్ల వార్షిక అంచనా బడ్జెట్ ఆమోదించారు.

జర్నలిజంలో ఏఐ పాత్ర కీలకం


- పీఐబీ ఏడీజీ రాజేందర్ చౌదరి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న రాజేందర్ చౌదరి

తిరుపతి సిటీ: ఆధునిక యుగంలో జర్నలిజం కొత్త పుంతలు తొక్కుతోందని, ఇందులో ఏఐ కీలకపాత్ర పోషిస్తోందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ప్రాంతీయ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వేవ్స్ 2025లో భాగంగా ఆన్‌లైన్ క్రియేట్ ఛాలెంజ్‌లలో యువత భారీగా పాల్గొనాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రాంతీయ మీడియాకు అందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలను చేరుకునేందుకు పీఐబీ పనిచేస్తోందన్నారు. ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు పీఐబీ పాత్ర కీలకమన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ వాణి, నాయశాస్త్ర విభాగాధిపతి ఆచార్య సీతాకుమారి, ప్రొఫెసర్ కిరణ్ ప్రసాద్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివ తేజస్సు





మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి క్షేత్రం సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి 14 రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం ముక్కంటికి ప్రియభక్తుడైన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. శ్రీకాళహస్తి పట్టణం విద్యుత్ దీపకాంతులతో విరాజిల్లుతోంది. స్వర్ణముఖి నది వంతెనపై నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం రాత్రి శోభాయమానంగా దర్శనమిచ్చింది. - శ్రీకాళహస్తి

వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల కమిటీ నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల కమిటీల్లో పలువురిని వివిధ హోదాల్లో నియమించినట్టు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉపాధ్యక్షుడిగా శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గాది మునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.వాసుదేవ నాయుడు, సంస్థాగత కార్యదర్శిగా ఎస్.మహదేవ్‌రెడ్డి, కార్యదర్శులుగా సి.వరప్రసాద్‌నాయుడు, బాలిశెట్టి విజయ్‌శేఖర్ నియమితులయ్యారు.

రాష్ట్ర అనుబంధ కమిటీలో చిత్తూరు జిల్లా వాసులు

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ కమిటీకి సంబంధించి చిత్తూరు జిల్లాలోని పలువురికి చోటు కల్పిస్తూ గురువారం కేంద్రపార్టీ కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. రాష్ట్ర మహిళా విభాగ ప్రధాన కార్యదర్శిగా లీనారెడ్డి, రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, రైతు విభాగం అఫిషియల్ స్పోక్ పర్సన్ ప్రవీణ్‌రెడ్డి, రైతు విభాగ సంయుక్త కార్యదర్శులుగా చంద్రశేఖర్‌రాజు, సుధాకర్‌నాయుడు, శ్రీరాములురెడ్డి, పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శులుగా దిలీప్‌రెడ్డి, జనార్ధన్, నగేష్‌రెడ్డి, సి. అమర్‌నాథ్‌రెడ్డిలను నియమించినట్లు ప్రకటనలో పేర్కొంది.

క్షమాపణలు చెప్పాల్సిందే


- టీటీడీ బోర్డు సభ్యుడికి వ్యతిరేకంగా ఉద్యోగుల ఆందోళన
- టీటీడీ పరిపాలనా భవనం వద్ద హోరెత్తిన నినాదాలు
- న్యాయం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు హెచ్చరిక



తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వద్ద న్యాయం చేయాలని నినదిస్తున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి కల్చరల్: అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ ఉద్యోగిని విచక్షణ కోల్పోయి దుర్భాషలాడిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌ను తక్షణం తొలగించి తమకు క్షమాపణ చెప్పాలని టీటీడీ ఉద్యోగులు నినదించారు. గురువారం టీటీడీ పరిపాలన భవనం వద్ద వారు టీటీడీ బోర్డు సభ్యుడి తీరుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు భవనం మహద్వారం వద్ద బైఠాయించి బోర్డు సభ్యున్ని తొలగించడంతో పాటు ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా ఉద్యోగులపై జరుగుతున్న దుశ్చర్యలపై ఉద్యోగ సంఘ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల పదవిలో ఉండే పాలక మండలి సభ్యులు 40 ఏళ్ల పాటు సర్వీసు అందించే ఉద్యోగులపై పెత్తనం చెలాయించడాన్ని తీవ్రస్థాయిలో తప్పు పట్టారు.

అడ్డుకట్ట వేయాలి..



టీటీడీ ఉద్యోగులపై ఇటీవల పెరుగుతున్న పాలక మండలి సభ్యుల ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసి ఉద్యోగుల ఆత్మగౌరవం రక్షించాలి. కనీసం విజ్ఞత లేకుండా బోర్డు సభ్యులు అవమానకరంగా దూషించడం అమానుషం. శ్రీవారి ఆలయ మహద్వారం వద్దే ఉద్యోగిని దూషించి బయటకు వెళ్లిపో అని హుకుం జారీ చేయడం దుర్మార్గం. తక్షణం ఆ బోర్డు సభ్యున్ని తొలగించాలి. ఆపై ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలి.

– గోల్కొండ వెంకటేష్, టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు

ఉద్యోగులను అవమానిస్తే సహించం



నిస్వార్థంగా విధులు నిర్వహించే ఉద్యోగులను దుర్భాషలాడుతూ అవమానించడం హేయమైన చర్య. ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి దుశ్చర్యలను ఉద్యోగులు సహించరు. ఉద్యోగి పట్ల దురుసుగా ప్రవర్తించిన టీటీడీ బోర్డు సభ్యుడిపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

– ఆర్‌కే భట్టు, టీటీడీ జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు


బోర్డు సభ్యుల పెత్తనం అమానుషం



విధి నిర్వహణలో నిరంతరం భక్తులకు సేవలు అందించే టీటీడీ ఉద్యోగులపై టీటీడీ బోర్డు సభ్యులు పెత్తనం చెలాయించడం అమానుషం. ఉద్యోగిపై చెప్పలేని పదజాలంతో దుర్భాషలాడడంపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిన టీటీడీ యాజమాన్యం, బోర్డు చైర్మన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదు. బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకుని ఉద్యోగుల్లో మనోస్థైర్యం నింపాల్సిన అవసరం ఉంది.

– దాసు, టీటీడీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి

తక్షణమే తొలగించాలి



పవిత్రమైన తిరుమల శ్రీవారి క్షేత్రంలో ఎలాంటి తప్పిదం లేకపోయినా ఉద్యోగిని దూషించడం దుర్మార్గం. బోర్డు సభ్యుడన్న అహంభావంతో విచక్షణా రహితంగా దుర్భాషలాడిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌మార్‌ను తక్షణం తొలగించాలి. ప్రభుత్వం, టీటీడీ యాజమాన్యం ఈ సంఘటనపై స్పందించి న్యాయం చేయాలి. లేదంటే దశలవారీ ఆందోళనలు కొనసాగిస్తాం.

– వెంకటరమణారెడ్డి, టీటీడీ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు

దుశ్చర్యలు మానుకోవాలి



నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలు అందిస్తున్న టీటీడీ ఉద్యోగుల పట్ల టీటీడీ పాలక మండలి సభ్యులు దుశ్చర్యలకు పాల్పడడం అత్యంత దారుణం. ఉద్యోగుల్లో మనోస్థైర్యం పెంచేలా ధర్మబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వానిదే. లేదంటే పోరాటాలు తప్పవు.

– పి.కిషోర్‌కుమార్, టీటీడీ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు

శ్రీవారి ఆలయ సమీపంలో విమానం

తిరుమల : శ్రీవారి ఆలయానికి సమీపంలో విమానం వెళ్లిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఒక విమానం శ్రీవారి ఆలయానికి సమీపంలో వెళ్లింది. అయితే సదరు విమానం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందో తెలియరాలేదు. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటువంటి విమానాలు వెళ్లరాదు. అయితే ఇటీవల అప్పుడప్పుడు విమానాలు ఆలయానికి సమీపంలో వెళ్తున్నాయి. ఇటీవల రాష్ట్ర హోంమంత్రి అనిత సైతం దీనిపై స్పందించి సంబంధిత అధికారులతో చర్చిస్తామని తెలిపిన విషయం తెలిసిందే.

శ్రీవారి ఆలయం పైకప్పుపై మరమ్మతులు

ఎండకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుమలలోని శ్రీవారి ఆలయం పైకప్పు ప్రాంతంలో చిన్న చిన్న మరమ్మతు పనులు, పెయింటింగ్ పనులను చేపట్టారు. ఏటా ఆలయ నిర్వహణలో భాగంగా సంబంధిత సిబ్బంది ఈ పనులను నిర్వహిస్తుంటారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.89,260
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,070

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,00,100
రిటైల్ వెండి గ్రాము	రూ.103.10

క్లుప్తంగా

కాలుష్య రహిత నగరమే లక్ష్యం



వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల యజమానులతో మాట్లాడుతున్న డీటీఓ మురళీమోహన్

తిరుపతి మంగళం: ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే తిరుపతిని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుదామని జిల్లా రవాణాశాఖాధికారి(డీటీఓ) కొర్రపాటి మురళీ మోహన్ కోరారు. మంగళంలోని తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని వాహన కాలుష్య తనిఖీ కేంద్రాలకు సంబంధించిన యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల వివరాలు, వాహన వివరాలను విధిగా వాహన పోర్టల్(వెబ్‌సైట్)లో తక్షణమే పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 10వ తేదీలోపు పూర్తి చేయాలని, లేనిపక్షంలో కాలుష్య తనిఖీ కేంద్రాల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి తిరుమల వచ్చే వాహనాలు నిర్దిష్టమైన వాహన కాలుష్య ప్రమాణాలను పాటించాలని సూచించారు. అలిపిరి ప్రాంతంలో తిరుమలకు వెళ్లే వాహనాల తనిఖీ చేసేందుకు మోటార్ వాహనాల తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. కాలుష్యం ఎక్కువగా ఉన్న వాహనాలను తిరుమల కొండపైకి అనుమతించమని, కండీషన్‌లో లేని వాహనాలను తిప్పితే సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ చరణ్, చక్రవర్తి పాల్గొన్నారు.


మహిళా దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలో ఆటోలో ప్రయాణించే వారి వద్ద చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ శ్యాంసుందర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ ఖమ్మం జిల్లాకు చెందిన సాకే స్వరూపరాణి అలియాస్ వెంకటలక్ష్మి (30) గత కొంతకాలంగా నగరంలో ఆటోల్లో ప్రయాణిస్తున్న వ్యక్తులను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడింది. లక్ష్మీపురం, ఎంఆర్ పల్లి సమీపంలో ఆటోల్లో ఇప్పటివరకు రూ.12 లక్షలు విలువచేసే 150 గ్రాములు బంగారు ఆభరణాలను చోరీ చేసిందన్నారు. ఈమెను తమ సిబ్బంది గురువారం హరే రామ హరే కృష్ణ రోడ్డులో అరెస్ట్ చేశారన్నారు. నిందితురాలి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి తిరుత్సవ-2025



తిరుపతి ఐఐటీ



ఐఐటీ 3డీ మ్యాప్

- ఐఐటీలో మూడు రోజుల పాటు వేడుకలు
- టెక్నో-కల్చరల్ ఫెస్ట్ పేరిట నిర్వహణ
- విద్యార్థులచే ఐఐటీ ఇంటరాక్టివ్ 3డీ మ్యాప్ క్యాంపస్ రూపకల్పన

ఏర్పేడు(రేణిగుంట): తిరుపతి ఐఐటీలో శుక్రవారం నుంచి ఏటా వైభవంగా నిర్వహించే తిరుత్సవ-2025 టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా ఎంతో వైవిధ్యంగా జరిగే ఈ ఉత్సవంలో సాంకేతికత, సాంస్కృతిక మేళవింపుతో విద్యార్థులు ఉల్లాసంగా జరుపుకుంటారు. విద్యార్థుల మేధాసంపత్తిని పరీక్షించే పోటీలతో పాటు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మేళవించే ప్రదర్శనలు, ప్రఖ్యాత సినీ, సంగీత, డీజే, పాప్ సింగర్లతో నిర్వహించే ప్రత్యేక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. తిరుపతి ఐఐటీ విద్యార్థులు ఏర్పేడు సమీపంలోని క్యాంపస్ ప్రాంగణాన్ని మొత్తం ఇంటరాక్టివ్ 3డీ మ్యాప్‌తో రూపొందించి బయట ప్రాంతాల నుంచి వచ్చే వారికి దిక్సూచీగా నిలిచే రీతిలో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అలాగే అతిపెద్ద గరుత్మంతుడి ప్రతిమను ఏర్పాటు చేశారు.

నేడు జరగనున్న కార్యక్రమాలు

- స్క్విడ్ గేమ్
- వన్ ఆన్ పేరిట జామ్, జర్నీ ఫర్ రిచెస్
- అనలాగ్ మిస్టరీ
- సాయంత్రం సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్‌చే మ్యూజికల్ నైట్

విజ్ఞానాన్ని అందించే ఉత్సవం



తిరుపతి ఐఐటీలో ఏటా వైభవంగా జరిగే 'తిరుత్సవ' కార్యక్రమం మూడు రోజులపాటు ఎంతో వైవిధ్యభరితంగా సాగుతూ మాకు వినోదాన్ని పంచడంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తోంది. ఇతర కళాశాలల్లో ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా ఇక్కడకు వచ్చి వారి అనుభవాలను పంచుకుంటారు. ఈసారి మరింత వైభవంగా జరగనున్నాయి. – **భువన్(ఐఐటీ విద్యార్థి, తిరుత్సవ ఈవెంట్ ఫైనాన్స్ హెడ్).**

3డీ మ్యాప్‌కు ఆదరణ సంతోషదాయకం



తిరుత్సవ కార్యక్రమాలకు వచ్చే అతిథుల కోసం మా బృందం రూపొందించిన క్యాంపస్ ఇంటరాక్టివ్ 3డీ మ్యాప్‌కు ఎంతో ఆదరణ రావడంతో పాటు, యాజమాన్యం ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉంది. ఐఐటీలో జరగనున్న తిరుత్సవ టెక్నో ఫెస్ట్ కోసం ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నా. **–అద్నాన్ రజ్వీ (ఐఐటీ విద్యార్థి, 3డీ మ్యాప్ రూపకర్త)**

సాంకేతికత, సంస్కృతిల మేళవింపు



ఐఐటీలో ఏటా మూడు రోజుల పాటు జరిగే తిరుత్సవ సాంకేతిక, సాంస్కృతిక మేళవింపును ప్రతిబింబిస్తుంది. కేవలం వినోదం కోసమే కాకుండా సాంకేతికతకు సంబంధించిన ఎన్నో ఆలోచనలు, భావాలను పంచుకుంటారు. కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు విద్యార్థుల కొత్త ఆవిష్కరణలకు బీజం పడుతుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. – **ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ, తిరుపతి**

గొప్ప అనుభూతి మిగుల్చుతుంది..



తిరుత్సవ కార్యక్రమం మూడు రోజులపాటు జరగనుంది. దీని కోసం ఇప్పటికే యాజమాన్యం సహకారంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. బయట నుంచి వచ్చే అతిథులు అందించే విలువైన సలహాల ద్వారా తెలియని విషయాలు నేర్చుకుంటాం. ఈ కార్యక్రమం మా అందరికీ ఎన్నో మధుర స్మృతులను మిగుల్చుతుంది. – **అన్వయ్ జోషి (ఐఐటీ విద్యార్థి, గ్రాఫిక్ అండ్ కంటెంట్ హెడ్)**

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- 23న గ్రూప్-2 మెయిన్స్
- జిల్లాలో 13 కేంద్రాల్లో పరీక్షలు
- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులతో కలసి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 23న జిల్లాలోని 13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉంటుందని అయితే అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు ఉంటుందని అయితే అభ్యర్థులు మధ్యాహ్నం 1.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఆ తర్వాత ఉదయం, మధ్యాహ్నం పరీక్షలకు కేవలం అదనంగా గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు మాత్రమే ఉంటుందన్నారు. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షలకు ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తారని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉంటుందని వివరించారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులు చూడాలని, తాగునీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అధికారులు, ముఖ్యపర్యవేక్షణ అధికారులు, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ముత్యపు పందిరిపై శ్రీహరి



సింహ వాహనంపై మాడవీధులలో భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీవారు



ముత్యపుపందిరిపై విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శ్రీనివాసుడు ఉభయదేవేరులతో కలిసి గురువారం రాత్రి ముత్యపు పందిరిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు యోగ ముద్రలో యోగనృసింహ అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తదుపరి స్వామి వారు సింహ వాహనాన్ని అధిష్ఠించి నాలుగు మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈఓ గోపీనాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహన్ రంగాచార్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలుగోరోజు అయిన శుక్రవారం ఉదయం స్వామివారు కల్పవృక్షవాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

విమానాశ్రయంలో మరింత మెరుగైన సేవలు



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, విమానాశ్రయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు

- ఎంపీ మద్దిల గురుమూర్తి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): భారతదేశంలోని ఏ విమానాశ్రయాల్లో లేని విధంగా బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు తిరుపతి విమానాశ్రయంలో విజయవంతంగా ల్యాండ్ కావడానికి రన్‌వే పొడవును 2285 మీ నుంచి 3810 మీటర్లకు విస్తరింపజేశారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.153.16 కోట్లతో విమానాశ్రయం విస్తరణను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఏఎస్ఎస్ మెంబర్ ఎం.సురేష్, కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుపతి విమానాశ్రయంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఏపీడీ శ్రీనివాసరావు, విమానాశ్రయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, డాప్లర్ వెరీ హై ఫ్రీక్వెన్సీ ఓమ్ని-డైరెక్షనల్ రేంజ్, డిస్టెన్స్ మెజర్‌మెంట్ ఎక్విప్‌మెంట్‌తో వంటి ఆధునిక నావిగేషన్ పరికరాల ఏర్పాటు ద్వారా విమానాశ్రయ సేవలు మరింత మెరుగ్గా మారతాయని తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి గల్ఫ్‌లో పనిచేసే వారి సౌకర్యార్థం తిరుపతి నుంచి నేరుగా కువైట్ విమానం ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో విమానాశ్రయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు పన్నీర్ శ్రీధర్ రెడ్డి, చంగల్రాయులు, ఎయిర్‌పోర్ట్ సీఎంఎస్ కిషోర్ సంబంధిత విమానాశ్రయ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికార పార్టీ ఆగడాలపై ఫిర్యాదు



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల ఆగడాలు, దోపిడీలను అడ్డుకోవడంతో పాటు అధికారులకు తక్షణమే ఫిర్యాదు చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్‌ఐ నాగరాజును కలిసి అధికార పార్టీ నాయకుల దుర్మార్గాలు, అరాచకాలను వివరించారు. చిల్లకూరు, వడ్డిపాళెం గ్రామాల్లో కొందరు అధికార పార్టీ నాయకులు ఇచ్చే మద్యానికి అలవాటుపడి వైఎస్సార్ సీపీ నాయకులకు ఫోన్ చేసి దుర్భాషలాడడం, బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం, మోహన్, అశోక్, ఆనంద్, జితేంద్ర, బాలు, బాలాజి, సురేష్, రమణయ్య, గురవయ్య, కోటి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే చోరీలపై ప్రత్యేక నిఘా

- ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ఆపరేషన్
- అదుపులోకి ముగ్గురు నిందితులు
- 85 గ్రాముల బంగారం, మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం



నిందితులను మీడియాకు చూపుతున్న ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్, జీఆర్పీ పోలీసులు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వేస్టేషన్ కేంద్రంగా చోరీలకు పాల్పడుతున్న వారిపై కొద్దిరోజులుగా ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టినట్లు ఆర్‌పీఎఫ్ సీఐ మధుసూదన్ వెల్లడించారు. గురువారం ఆయన జీఆర్పీ పోలీసులతో కలసి తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. చోరీలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు తిరుపతిలోని అన్ని ప్లాట్‌ఫాంలపై దృష్టి సారించామన్నారు. ఆంధ్రతో పాటు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ముగ్గురు నిందితులను గురువారం తిరుపతి రైల్వేస్టేషన్‌లోనే అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.1.70 లక్షలు విలువజేసే 85 గ్రాముల బంగారం, రూ.16 వేలు విలువజేసే రెండు మొబైల్స్, రూ.1.90 లక్షలు విలువజేసే రెండు ల్యాప్‌టాప్‌లు.. మొత్తంగా రూ.3,76,000 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల పేర్లను మీడియాకు వెల్లడించలేదని, ఎందుకంటే వీరితో పాటు వీరి సన్నిహితులను పట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే పేర్లు తెలిజేయలేదన్నారు. ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తిరుపతి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన వెల్లడించారు. దేశవిదేశాల నుంచి భక్తులు వచ్చిపోతున్న నేపథ్యంలో నిఘా మరింత పెంచామని వెల్లడించారు.

తిరుపతి, తిరుమలలో అరకు కాఫీ యూనిట్లు

– పర్యాటకశాఖ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్



తిరుపతి జిల్లా కలెక్టర్, జేసీతో చర్చిస్తున్న అజయ్‌జైన్

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో తిరుమలతో పాటు పర్యాటక ప్రదేశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నారని పర్యాటకశాఖ, హౌసింగ్ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ప్రశ్నించారు. గురువారం ఆయన తిరుపతి కలెక్టరేట్‌కు విచ్చేయగా కలెక్టర్ వెంకటేశ్వర్ తోపాటు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పర్యాటక, ఆతిథ్యరంగ అభివృద్ధికి శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రధానంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులు కనీసం మూడు రోజులు జిల్లాలో బస చేసి పలు పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే అరకు కాఫీ యూనిట్లు తిరుపతి నగరంలో రెండు, తిరుమలలో ఒక యూనిట్ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్, టీటీడీ సౌజన్యంతో చేపట్టనున్నట్లు వివరించారు.

ఆరుబయట కూర్చుని ఉండగా..



బాధితురాలు జయమ్మ

నాయుడుపేటటౌన్ : పట్టణానికి చెందిన ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధికి చెందిన జయమ్మ ఇంటి ఆరుబయట కూర్చుని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌లో వేగంగా వచ్చి మెడలోంచి బంగారు చైన్‌ను లాక్కెళ్లినట్లు తెలిపింది. అప్పటికే జయమ్మ అరుపులు, కేకలు వేయడంతో స్థానికులు చుట్టుపక్కల గాలించారు. ఈ మేరకు 3 సవర్ల బంగారు చైన్ చోరీకి గురైనట్లు వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గాలింపు చర్యలు చేప ట్టారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు బ్రెయిన్ స్ట్రోక్



కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తీసుకొచ్చిన గంగాబాబు



బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్

నాయుడుపేటటౌన్: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ గణేశన్ అచేతనంగా పడిపోతుండడాన్ని గుర్తించి అటుగా వస్తున్న ఓ వ్యక్తి స్పందించి ప్రాణాలు కాపాడిన ఘటన గురువారం సాయంత్రం వెలుగు చూసింది. వివరాలు.. నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో గస్తీ నిర్వహించే ఆర్పీఎఫ్ పోలీసులకు ఒక గది కేటాయించారు. డ్యూటీ నిమిత్తం గురువారం కానిస్టేబుల్ గణేశన్ రైల్వేస్టేషన్‌కు వచ్చి గదిలో అచేతనంగా పడిపోతుండడాన్ని అటుగా వెళ్తున్న పట్టణానికి చెందిన గంగాబాబు గుర్తించి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు సత్వర వైద్యం అందించారు. అయితే కానిస్టేబుల్‌కు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, సకాలంలో వైద్యశాలకు తీసుకుని రావాడంతో ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. వెంటనే స్పందించి ఆస్పత్రికి తీసుకొచ్చిన గంగాబాబును వైద్యులుఅభినందించారు.

మహిళా రైతు సంఘాల బలోపేతమే లక్ష్యం

– డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: మహిళా రైతు సంఘాలను (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు)బలోపేతం చేద్దామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీఎస్ శోభన్‌బాబు తెలిపారు. గురువారం తిరుపతిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సంబంధించి జిల్లాస్థాయిలో శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 వేల పొదుపు సంఘాలు ఉన్నాయని.. ఒక్కో పొదుపు సంఘంలో పది మంది సభ్యుల చొప్పున జిల్లావ్యాప్తంగా సభ్యులు 3,40,000 మంది ఉన్నారన్నారు. అయితే అందులోని మహిళలు 15 నుంచి 20 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘాల పేరుతో జిల్లాలో సుమారుగా 2700 సంఘాలను ఏర్పాటు చేసిన విషయాన్ని తెలియజేశారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం(నేషనల్ రూరల్ లైవ్‌లీ ఉడ్ మిషన్) నేతృత్వంలో సంఘాల బలోపేతానికి వారికి సాయం చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రధానంగా మహిళా రైతు సంఘాలకు సేద్యం చేయడానికి అవసరమైన పలు పరికరాలను సబ్సిడీతో ఇవ్వడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయడానికి వారిని ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం సహకారశాఖ జిల్లా అధికారి లక్ష్మీ మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను రిజిస్ట్రేషన్ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రభావతి, జీవనోపాధుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరెడ్డి, ఏపీఎం ద్రాక్షాయణి, ట్రైనర్ విజయ్‌కుమార్, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెందిన సభ్యులు, లీడర్లు పాల్గొన్నారు.

అనుమతులు ఇవ్వడం మా బాధ్యత



పరిశ్రమల స్థాపనపై మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- ఉద్యోగ, ఉపాధి కల్పన మీ బాధ్యత
- పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించి అనుమతులు పొందిన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఉత్పత్తుల దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీపై అధికారులతో పాటు పలు పరిశ్రమల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు ఇవ్వడం మా బాధ్యత.. అలానే పరిశ్రమల నిర్మాణంతోపాటు స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం మీ బాధ్యతగా భావించాల్సి ఉంటుందని వివరించారు. మరోవైపు పరిశ్రమల విభాగానికి చెందిన అధికారులు నిత్యం అనుమతి పొందిన పరిశ్రమల నిర్మాణాలు, ఉత్పత్తులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. అలాగే ఉత్పత్తులు చేపడుతున్న పరిశ్రమల్లో తప్పకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పరిశ్రమల జిల్లా జిల్లా ఇన్‌చార్జి అధికారి మారుతిప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి, తిరుపతి స్పెషల్ ప్రాజెక్టు జోనల్ మేనేజర్ శివకుమార్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్య, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలసి అధికారులతో సమావేశం నిర్వహించారు.